సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం ၊ 12 ၊ అక్టోబర్ ၊ 2025



ఊపిరి తీసుకోలేక..

కొద్ది రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పులతో పిల్లల్లో న్యూమోనియా లక్షణాలు కనిపిస్తున్నాయి.

8లో



అండర్-19 క్రీడా జట్ల ఎంపిక

ఖమ్మంలో శనివారం ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్, హ్యాండ్‌బాల్ బాలబాలికల జట్లను ఎంపిక చేశారు.

8లో

గరిష్ఠం / కనిష్ఠం

31°/ 23°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతంగా మారుతుంది. మధ్యాహ్నం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు.

15న జిల్లాస్థాయి సైన్స్ డ్రామా

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 15న జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ బి.నాగలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో 8 నుంచి 10వ తరగతి లోపు చదివే పిల్లలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. 'సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ద బెనిఫిట్ ఆఫ్ మాన్ కైండ్' ప్రధానాంశంగా, విమన్ ఇన్ సైన్స్, స్మార్ట్ అగ్రికల్చర్, డిజిటల్ ఇండియా, ఎంపవరింగ్ లైఫ్, హైజీన్ ఫర్ ఆల్, గ్రీన్ టెక్నాలజీస్ ఉపాంశాలుగా తీసుకోవాలని సూచించారు. డ్రామా నిడివి 30 నిమిషాలకు మించొద్దని, ఎనిమిది మంది మాత్రమే స్టేజిపై ప్రదర్శన ఇవ్వాలని, స్క్రిప్ట్ రైటర్, డైరెక్టర్ హాజరు కావొచ్చని వివరించారు. డ్రామా ఏ భాషలోనైనా ఉండవచ్చని తెలిపారు. డ్రామాలో పాల్గొనే వారి వివరాలను ఈ నెల 14వ తేదీలోగా జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్ 98492 29350 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. పోటీలు పాత కొత్తగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(ఆనందఖని)లో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఖమ్మంలో వేంకటేశ్వర స్వామి ఆలయం

- రేపు స్థలాలు పరిశీలించనున్న టీటీడీ బృందం

ఖమ్మంఅర్బన్: కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఖమ్మంలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యాన నిర్మించనున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వినతితో టీటీడీ సానుకూలంగా స్పందించగా కొద్దిరోజుల క్రితం ఓ బృందం ఇక్కడ సానుకూలతలను పరిశీలించింది. ఆ తర్వాత 15వ డివిజన్ అల్లీపురం పరిధి హైదరాబాద్-దేవరపల్లి హైవే వెంట ధంసలాపురంలో సర్వే నంబర్లు 565, 563, 564, 565లో సుమారు 20 ఎకరాల భూమి అనుకూలంగా ఉందని అధికారులు నివేదిక సిద్ధం చేశారు. అంతేకాక అదే గ్రామంలో సర్వే నంబర్ 408లో మరో 20 ఎకరాల భూమి కూడా ఉందని తెలిపారు. ఈ స్థలాలతో పాటు రఘునాథపాలెం బైపాస్‌లో నరసింహులు గుట్ట భూమిని సైతం సోమవారం టీటీడీ బృందం పరిశీలించనుంది. ఆ తర్వాత స్థలాన్ని ఖరారు చేసి వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు.

శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు




ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి పాదానికి, శ్రీస్వామి వారి విగ్రహానికి పంచామృతాభిషేకం చేశారు. శ్రీవారిని, శ్రీఅలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్య కల్యాణం గావించారు. ఆ తర్వాత శ్రీవారికి పల్లకి సేవ చేయగా ఏపీ, తెలంగాణా రాష్ట్రాల భక్తులు దర్శించుకుని మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కొత్తూరి జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక దర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

డైనోసార్.. స్టెగోడాన్

సింగరేణి తవ్వకాల్లో లభించిన అవశేషాలు

- గోదావరి లోయలో ప్రాచీన చరిత్ర ఆనవాళ్లు
- తెలంగాణ గడ్డపై నడయాడిన భారీ జంతువులు
- బిర్లా సైన్స్ సెంటర్‌లో ప్రత్యేక పెవిలియన్‌లో ప్రదర్శన



బిర్లా సైన్స్ సెంటర్‌లో డైనోసార్ ఆకృతి నమూనా

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సృష్టి పరిణామ క్రమంలో భూమిపై మంచుయుగం అంతరించాక రాక్షస బల్లులు (డైనోసార్లు), రాకాసి ఏనుగు(స్టెగోడాన్)ల వంటి భారీ జంతువులు వేర్వేరు కాలాల్లో ఆవిర్భవించాయి. ఈ జంతువులు క్రీస్తు పూర్వం మిలియన్ సంవత్సరాల క్రితమే భూమిపై సంచరించాయి. ఆ కాలంలో జీవించిన స్టెగోడాన్ జాతికి చెందిన ఏనుగులు, రాక్షస బల్లులు ప్రాణహిత-గోదావరి లోయ ప్రాంతంలో ఒకప్పుడు రాజ్యమేలాయి. అందుకు సంబంధించిన అవశేషాలు కొన్నేళ్లుగా వెలుగుచూస్తున్నాయి.

గత ఏప్రిల్‌లో స్టెగోడాన్ అవశేషాలు

గోదావరికి ఉపనదులైన ప్రాణహిత, వార్ధా, పెన్‌గంగా పరీవాహక ప్రాంతంలో మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో 2025 ఏప్రిల్‌లో స్టెగోడాన్ జాతికి చెందిన ఏనుగుల అవశేషాలు లభించాయి. ఈ విషయం దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. దీంతో అప్పటికే సింగరేణి ఆధీనంలో స్టెగోడాన్ ఏనుగుల అవశేషాలపై దృష్టి పడింది. తెలంగాణ గడ్డపై జీవించిన ప్రాచీన జీవజాలానికి సంబంధించిన చరిత్రను ప్రపంచానికి పరిచయం చేసేందుకు సింగరేణి-బిర్లా సైన్స్ సెంటర్లు జత కట్టాయి. అందులో భాగంగా బిర్లా సైన్స్ సెంటర్‌లో సింగరేణి పెవిలియన్ పేరుతో ప్రత్యేక ప్రదర్శనశాల ఏర్పాటుకు నిర్ణయించారు. సింగరేణి తవ్వకాల్లో లభించిన వందలాది పురాతన శిలాజాల్లో యాభైకి పైగా శిలాజాలను కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో ప్రదర్శనకు పెట్టారు. అందులో స్టెగోడాన్ జాతికి చెందిన ఏనుగు దంతాలు కూడా ఉన్నాయి. అంతకుముందు మరొక జత స్టెగోడాన్ ఏనుగు దంతాలు, దవడ అవశేషాలను నెహ్రూ జూలాజికల్ పార్కుకు ఇచ్చారు. ప్రస్తుతం కొత్తగూడెం మ్యూజియంలో స్టెగోడాన్ ఏనుగుకు సంబంధించిన ఒక దంతం, దాని రిప్లికాలు ఉన్నాయి.



స్టెగోడాన్ దంతాలను పరిశీలిస్తున్న సింగరేణి సీఎండీ బలరామ్, అధికారులు

ఈ ప్రాంతంలోనే డైనోసార్లు..

సింగరేణి బొగ్గు గనులు విస్తరించిన గోదావరి పరీవాహక ప్రాంతం ఒకప్పుడు భారీ జంతువులకు నెలవుగా ఉండేది. ప్రస్తుతం బిర్లా సైన్స్ ప్లానిటోరియంలోని డైనోసారియంలో కనిపించే రాక్షస బల్లి(డైనోసార్) ఆకృతికి సంబంధించిన అవశేషాలు గోదావరి తీరంలోని మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం వేమనపల్లి దగ్గర అడవుల్లో 1974-80 వరకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా చేపట్టిన పరిశోధనల్లో లభించాయి. మొత్తంగా 12 డైనోసార్లకు చెందిన 840 అవశేషాలతో డైనోసార్ ఆకృతి తయారుచేశారు. అంతకు ముందు 1960, 70వ దశకాల్లో ప్రస్తుత ములుగు జిల్లాలోని ఏటూరునాగారం ఏజెన్సీలో సైతం ప్రాచీన కాలానికి సంబంధించిన జంతుజాలం అవశేషాలు లభించాయి. వీటిని బిర్లా సైన్స్ సెంటర్, ఆర్కియాలజీ మ్యూజియం, వరంగల్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) మ్యూజియం-బండ్లగూడలో భద్రపరిచారు. చివరిసారిగా 2014లో ఏటూరునాగారం మండలం బుట్టాయిగూడెం దగ్గర ప్రాచీన శిలాజాలు వెలుగుచూశాయి.

బొగ్గు తవ్వకాల్లో..

గోదావరి-ప్రాణహిత నది పరీవాహకంలో సింగరేణి సంస్థ వందేళ్లకు పైగా బొగ్గును వెలికితీస్తోంది. 2020-21లో పెద్దపల్లి జిల్లా రామగుండం-2 ఏరియాలోని మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గనిలో ఓవర్ బర్డెన్(మట్టి) తొలగిస్తుండగా భూమి లోపలి పొరల్లో నిక్షిప్తమైన ఐదు ఏనుగు కొమ్ములు లభించాయి. వీటిపై పరిశోధనలు జరిపి, క్రీస్తు పూర్వం 26 వేల నుంచి 23 వేల ఏళ్ల క్రితం భూమిపై సంచరించిన స్టెగోడాన్ జాతికి చెందిన ఏనుగుల అవశేషాలుగా తేల్చారు. ఈ ఏనుగు 13 అడుగుల ఎత్తుతో 13 టన్నుల బరువుతో ఉండేదని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. వీటన్నింటినీ కొత్తగూడెంలోని ఎక్స్‌ప్లోరేషన్ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉన్న ఎపిక్ సెంటర్‌లోని మ్యూజియంలో భద్రపర్చారు.

అందరికీ చూపించాలనే..

హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ సెంటర్ వేదికగా పెవిలియన్ ఏర్పాట్లు చేశాం. బొగ్గు తవ్వకాల సందర్భంగా లభించిన స్టెగోడాన్ జాతికి చెందిన ఏనుగు అవశేషాలను ఈ తరానికి చూపించాలనేది మా లక్ష్యం. అందుకే సింగరేణి పెవిలియన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాం.

-బలరాంనాయక్, సింగరేణి సీఎండీ

ముగిసిన అటవీశాఖ జోనల్ క్రీడలు

విజేతలకు బహుమతులు అందజేసిన సీసీఎఫ్



పోటీలకు హాజరైన అటవీశాఖ సిబ్బంది

చుంచుపల్లి: కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న అటవీ శాఖ జోనల్ స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలకు చెందిన 800 మంది అటవీ ఉద్యోగులు, సిబ్బంది క్రీడల్లో పాల్గొన్నారు. అథ్లెటిక్స్, వాలీబాల్, క్రికెట్, షటిల్, కబడ్డీ తదితర క్రీడా పోటీలను నిర్వహించగా, ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన టీమ్‌కు భద్రాద్రి జోన్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డి.భీమానాయక్ ట్రోఫీ అందజేశారు. జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులను, సిబ్బందిని కూడా సీసీఎఫ్, డీఎఫ్ఓలు సత్కరించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ భీమానాయక్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. ఐదు జిల్లాల అటవీ అధికారులు కిష్టాగౌడ్, సిద్ధార్థ విక్రమ్ సింగ్, బత్తుల విశాల్, బి.లావణ్య, అనూజ్ అగర్వాల్ అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

మరో విద్యుత్ ప్లాంట్‌కు ముందడుగు

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ: పాల్వంచలో మరో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు మరో ముందుడుగు పడిందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం కేటీపీఎస్ గెస్ట్‌హౌస్‌లో కేటీపీఎస్ 5,6,7 దశల చీఫ్ ఇంజనీర్లు ఎం.ప్రభాకర్ రావు, శ్రీనివాస్ బాబులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. కొత్త ప్లాంట్ ఏర్పాటుకు అనుకూలతలపై సమీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్త కర్మాగారం ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై డిజైన్ కంపెనీకి సర్వే చేయాలని నిధులు మంజూరు చేయడం జిల్లా ప్రజలకు ఊరటనిచ్చే అంశమని అన్నారు. ఇక్కడ ప్రస్తుతం అందుబాటులో ఉన్న 450 ఎకరాల భూమి 800 మెగావాట్ ప్లాంట్‌కు సరిపోతుందని, రెండు కర్మాగారాలు నిర్మించాలంటే మరో 200 ఎకరాలు అవసరం ఉంటుందని, దీని కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశం కూడా పరిశీలిస్తామన్నారు. ఇప్పటికే కార్పొరేషన్ చేశామని, ఇక్కడ కూడా ఎన్నికలు నిర్వహించడంతోపాటు, అభివృద్ధి శరవేగంగా జరిగే అవకాశాలు ఉంటాయని అన్నారు. ఎన్ఎండీసీ కర్మాగారం విస్తరణను కూడా ప్రైవేట్ కంపెనీకి అప్పగించి ఇక్కడ పరిశ్రమ తీసుకురావాలనే కృతనిశ్చయంతో ఉన్నానని అన్నారు. సమావేశంలో ఎస్ఈ యుగపతి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, సీతారామి రెడ్డి, దుగ్గిరాల సుధాకర్, ముత్యాల విశ్వనాథం, పూర్ణ చందర్ రావు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ధనధాన్య కృషి యోజన ప్రారంభం



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ భరత్

సూపర్‌బజార్(కొత్తగూడెం): పీఎం ధన ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించగా, కొత్తగూడెం కేవీకేలో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి.భరత్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని, భూసారం పెంచుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త ఎస్.హేమశరత్ చంద్ర, ఉద్యాన శాస్త్రవేత్త బి.శివ, డీడీఏ సరిత, మణుగూరు ఏడీఏ తాతారావు, ఇల్లెందు ఏడీఏ లాల్‌చంద్, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సుమారు 250 మంది రైతులు పాల్గొన్నారు.

నూరుశాతమే లక్ష్యం

- పదో తరగతిలో ఫలితాల మెరుగుకు విద్యాశాఖ అధికారుల దృష్టి
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- అభ్యాస దీపికలతో సన్నద్ధత, వారానికోసారి పరీక్షలు



పాల్వంచ జెడ్పీహెచ్ఎస్‌లో ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న విద్యార్థులు

కరకగూడెం: పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ దృష్టిసారించింది. పరీక్షలకు కొద్ది నెలల ముందు నిర్వహించే ప్రత్యేక తరగతులను ఈసారి ముందస్తుగానే, ఇటీవల ప్రారంభించింది. కష్టమైన అంశాలపై శ్రద్ధ చూపేలా అభ్యాస దీపికలను (వర్క్ బుక్స్) ఆధారంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తున్నారు. జిలాల్లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలు 110 ఉండగా 4,650 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. 14 కేజీబీవీ పాఠశాలల్లో కూడా 567 మంది 10వ తరగతి చదువుతున్నారు. ఈసారి పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో సిలబస్ పూర్తి చేయడంతపాటు ప్రతీ విద్యార్థికి సబ్జెక్ట్‌పై లోతైన అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు బోధన చేపడుతున్నారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించడమే ప్రత్యేక తరగతుల ఉద్దేశమని అధికారులు పేర్కొంటున్నారు. కాగా, జిల్లా పదో తరగతి వార్షిక పరీక్షల్లో 2023-24 విద్యా సంవత్సరంలో 92.24 శాతం, 2024-25లో 92.14 శాతం ఫలితాలు సాధించింది.

పక్కాగా ప్రత్యేక తరగతులు

ప్రణాళిక ప్రకారం రోజూ పాఠశాల వేళలకు ముందు/ తరువాత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు వ్యక్తిగత దృష్టి సారించి, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. వారానికోసారి పరీక్ష నిర్వహిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేస్తున్నారు. ఏ విద్యార్థి ఏ సబ్జెక్ట్‌లో వెనుకబడ్డాడో గుర్తించి, మెరుగుపర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులకు ప్రతీ సబ్జెక్ట్‌కు సంబంధించిన అభ్యాస దీపికలను పంపిణీ చేశారు. దీపికలోని ప్రశ్నలు, అభ్యాసాలను పూర్తి చేయించడం ద్వారా విద్యార్థులు సొంతంగా నేర్చుకునే నైపుణ్యాన్ని పెంచుకునేలా ప్రోత్సహిస్తున్నారు. గత పరీక్షల్లో తరచుగా అడిగిన ప్రశ్నలను, కష్టమైన యూనిట్లను పొందుపరిచి, చదివించడంతో విద్యార్థుల్లో పరీక్షలంటే భయం తగ్గనుంది. విద్యార్థులకు చదువుపై ఉన్న భయాన్ని పోగొట్టి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. టీచర్లు, అధికారులు కలిసి ఈ ఏడాది పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా పాటుపడుతున్నారు.

మంచి మార్కులు సాధిస్తాం



ప్రత్యేక తరగతులు ఉపయోగకరంగా ఉన్నాయి. అభ్యాస దీపికలతోతో స్వయంగా ప్రాక్టీస్ చేయగలుగుతున్నాం. ప్రతీ వారం జరిగే పరీక్షలతో భయం కూడా తగ్గిపోయింది. మంచి మార్కులు సాధిస్తామనే నమ్మకం వచ్చింది.

-సాయి ప్రణదీప్, పదో తరగతి, భట్టుపల్లి పాఠశాల

దృష్టి సారించాం..



ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. సిలబస్ పూర్తి చేస్తూనే ప్రత్యేక తరగతుల్లో కీలక అంశాలపై దృష్టి సారించాం. పటిష్టంగా పర్యవేక్షిస్తూ విద్యార్థులను ముందస్తుగా సిద్ధం చేస్తున్నాం.

- నాగలక్ష్మి, జిల్లా విద్యాశాఖాధికారి

పరీక్షలకు సన్నద్ధం చేయాలి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అశోక్

దుమ్ముగూడెం: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ ఇన్‌చార్జి డీడీ అశోక్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తపల్లి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని పరిసరాలు, వంటగది, స్టోర్ రూమ్, డార్మెటరీ, డైనింగ్ హాల్‌లను పరిశీలించారు. మెనూ అమలుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. డైలీ వేజ్ వర్కర్లు సమ్మె చేస్తున్నందున, వంట నిర్వహణలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు తిన్న తర్వాతనే విద్యార్థులకు భోజనం వడ్డించాలని అన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను నాగేంద్రబాబు, కొర్సా సాయిరాంలను అభినందించారు. హెచ్ఎం నరసింహారావు, ఉపాధ్యాయులు హరికృష్ణ, గంగారాం, సునీత పాల్గొన్నారు.

గురుకులాలకు నిధుల విడుదలపై హర్షం

పాల్వంచరూరల్: గురుకుల విద్యాసంస్థల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.60 కోట్లను విడుదల చేయడం హర్షణీయమని గిరిజన సంక్షేమ గురుకుల సంస్థ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్యామ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో గిరిజన గురుకులాలకు రూ.10 కోట్లు కేటాయించడం ప్రోత్సాహకరమని తెలిపారు. దీంతో సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.

విజ్ఞప్తులతో విసిగిపోయి.. తలా ఓ చేయి వేసి..

- ఏడాది కాలంగా గుంతలమయంగా మారిన ముర్రేడు వంతెన
- పట్టించుకోని ఎన్‌హెచ్, స్పందించిన మున్సిపల్ కార్పొరేషన్
- వంతెనపై గుంతలను సొంత ఖర్చులతో పూడ్చిన యువకులు



ముర్రేడు వాగు వంతెనపై ఏర్పడిన గుంతలను కాంక్రీట్ మిశ్రమంతో పూడ్చుతున్న యువకులు



వంతెనపై నిరసన తెలుపుతున్న వాహనదారుడు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: విజయవాడ-జగ్‌దల్‌పూర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-30)లో కొత్తగూడెం నగరంలో ముర్రేడువాగుపై ఉన్న పాత బ్రిడ్జి మొత్తం గుంతలమయంగా మారింది. ఏడాదిన్నరగా ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు నరకం చూస్తున్నారు. రాజకీయ పక్షాలు విజ్ఞప్తులు చేసినా, మీడియాలో పలుమార్లు కథనాలు వచ్చినా సమస్యకు పరిష్కారం లభించలేదు. ఆఖరికి ఆగస్టులో ఐడీఓసీలో ముగ్గురు మంత్రుల సమక్షంలో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి సమావేశంలోనూ ఈ సమస్య ప్రస్తావనకు వచ్చింది. జాతీయ రహదారుల శాఖ తన పని చేయకపోయినా ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్లు, భవనాల శాఖ, మున్సిపల్ శాఖల అధికారులైనా తాత్కాలిక మరమ్మతులు చేయాలని సూచించారు. రెండు నెలలు గడిచినా ఆ పని జరగలేదు. శనివారం కూడా ఓ వాహనదారుడు నిరసన తెలిపాడు. ప్రభుత్వ శాఖలకు మొరపెట్టుకోవడం చెవిటివాడి ముందు శంఖం ఊదినట్టే అయింది. ఆటోలు, టూ వీలర్లు పాడైపోతున్నాయి. దీంతో నగరంలోని లోతువాగు ప్రాంతానికి చెందిన యాకుబ్‌పాషా, బొమ్మగాని శ్రీకాంత్, పాషా, బన్నీ, సూర్య, శ్రీధర్, నితిన్, మనోజ్ తదితరులు సమస్య పరిష్కారానికి నడుం బిగించారు. సొంత ఖర్చులతో కాంక్రీట్ మిశ్రమాన్ని తయారు చేసి ఆటోలో తీసుకొచ్చి వంతెనపై గుంతలు ఉన్నచోట వేశారు. చిన్న నిర్లక్ష్యం కారణంగా పెను ప్రమాదం జరగకుండా తమవంతు బాధ్యతను నెరవేర్చారు. దాదాపు ఏడాది పాటు నగర ప్రజలను, ఈ మార్గం గుండా ప్రయాణించే వారిని పీడిస్తున్న సమస్య పరిష్కారానికి పాటుపడ్డారు. వీరు చేసిన ప్రయత్నం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యువకుల కృషిని పలువురు అభినందిస్తున్నారు.

నేడు అభినందన సభ

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో ఆయిల్‌ఫెడ్ అధికారులకు ఆదివారం అభినందన సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి తదితరులు హాజరుకానున్నారు. శనివారం అప్పారావుపేట ఫ్యాక్టరీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయిల్‌ఫెడ్ అడ్వైజరీ కమిటీ మెంబర్ అలపాటి రామచంద్ర ప్రసాద్ వివరాలు వెల్లడించారు. 2024-25 సంవత్సరంలో ఆయిల్‌ఫెడ్‌కు నిర్దేశించిన మూడు లక్షల టన్నుల పామాయిల్ గెలల దిగుబడి లక్ష్యాన్ని విజయవంతంగా సాధించిన నేపథ్యంలో అప్పారావుపేట ఫ్యాక్టరీలో సంబంధిత అధికారులకు, సిబ్బందికి అభినందన సభ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ సభకు పామాయిల్ రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఏజెన్సీలను రద్దు చేయాలి

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య



ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలిసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు

కొత్తగూడెంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేయాలని తెలంగాణ స్టేట్ ఔట్ సోర్సింగ్ జేఏసీ కమిటీ ప్రెసిడెంట్ పులి లక్ష్మయ్య కోరారు. ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసి వివిధ శాఖల్లో ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని అన్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు వినతిపత్రం అందించి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరఫున సహకరించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, ప్రతి ఏడాది ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. కార్మిక శాఖ మంత్రితో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మీనాక్షి నటరాజన్ హామీ ఇచ్చారని లక్ష్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రటరీ దుర్గం శ్రీను, ట్రెజరర్ సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ, బాలకృష్ణ, క్రాంతి, విజయలక్ష్మి, సురేష్, రాజేష్, గౌస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కిన్నెరసాని గేటు ఎత్తివేత



గేటు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న వరదనీరు

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలకు కిన్నెరసాని జలయాశానికి వరద కొనసాగుతోంది. శనివారం నీటిమట్టం 406.40 అడుగులకు పెరగడంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటును ఎత్తివేసి 2 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు.

ఎస్పీకి రేగా ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న రేగా కాంతారావు

కొత్తగూడెంటౌన్: మణుగూరు పోలీస్ స్టేషన్ సమీపంలో సీఐ ఎదుట ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అనుచరుడు గంటా రమేశ్ ఓ రైతుపై చేయి చేసుకున్న ఘటనలో అతడితోపాటు సీఐపై చర్యలు తీసుకోవాలని శనివారం ఎస్పీ రోహిత్‌రాజుకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఫిర్యాదు చేశారు. కొత్తగూడెంలో ఎస్పీ రోహిత్‌రాజును బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కలిసి ఘటన వివరాలు వెల్లడించారు. అనంతరం రేగా మాట్లాడుతూ.. శుక్రవారం కమలాపురం గ్రామంలో ఓ రైతుపై చేయి చేసుకుంటుంటే సీఐ ఏం చేస్తున్నారని, ఇసుక మాఫియాకు ఎందుకు వత్తాసు పలుకుతున్నారని, కారకులను కఠినంగా శిక్షించాలని ఎస్పీని కోరినట్లు రేగా తెలిపారు. కార్యక్రమంలో కుర్రి నాగేశ్వరావు, కుంట లక్ష్మణ్, నూకారపు రమేశ్, పోషం నర్సింహారావు, తాళ్లపల్లి యాదవ్‌గౌడ్, మధు, బోశెట్టి రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్పాలు మనుషులు, ప్రకృతికి ఉపయోగమే..



పట్టుకున్న పాములను అటవీ ప్రాంతంలో వదులుతున్న సంతోష్

కొత్తగూడెంఅర్బన్: సర్పాలు మనుషులు, ప్రకృతికి ఉపయోగకరమేనని ప్రాణధార ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రెస్క్యూ స్పెషలిస్టు సంతోష్ తెలిపారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం, రామా టాకీస్ ఏరియా, పాత కొత్తగూడెం, బాబూక్యాంప్, సెంట్రల్ పార్క్ ప్రాంతాల్లో ఇటీవల ఇళ్లల్లోకి చేరి సురక్షితంగా బంధించి నాలుగు నాగు పాములు (నాజా నాజా), నూనె కట్లపాము (వోల్ఫ్ స్నేక్), జె ర్రిపోతు (రాట్ స్నేక్) జాతులకు చెందిన ఆరు పాములను శనివారం అటవీ ప్రాంతంలో విడుదల చేశారు. ప్రకృతి జీవరాసులైన సర్పాలతో క్రిమి కీటకాలు, పంట వినాశకాల నియంత్రణ, జీవవైవిధ్యం, ఔషధాల ఉత్పత్తి కోసం సర్పాల అవసరం ఉన్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెస్క్యూటీం సభ్యుడు నారదాసు శ్రీకాంత్ (చోటు) పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీటీ ర్యాంకింగ్ టోర్నీ



మ్యాచ్‌లో సర్వీస్ చేస్తున్న క్రీడాకారిణి

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న బాలసాని సన్యాసయ్య స్మారక రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీ శనివారం రెండో రోజుకు చేరింది. అండర్-11, 13 బాలికల విభాగంలో జిల్లాకు చెందిన బాలసాని తన్మయి, హార్విక‌తో పాటు డి.శాన్విక క్వార్టర్ ఫైనల్స్‌కు చేరారు. అండర్- 13, 17 బాలుర విభాగంలోనూ జిల్లా క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. ఇక హైదరాబాద్, రంగారెడ్డి, జిల్లాల క్రీడాకారులు సైతం తమ ర్యాంకును నిలుపుకునేందుకు పోటీ పడుతున్నారు. శనివారం రాత్రి 45 – 80 ఏళ్ల కేటగిరీల పోటీలు ప్రారంభమయ్యాయి. కాగా, ఆదివారం రాత్రి ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహిస్తామని టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్ తెలిపారు. అంతేకాకజాతీయస్థాయి టోర్నీలో పాల్గొనే రాష్ట్రజట్లను ఎంపిక చేస్తామని వెల్లడించారు. పోటీల ముగింపు సమావేశానికి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.కె.మహేశ్వరి, సి.నాగేందర్‌రెడ్డి, టెక్నికల్ అఫీషియల్ ఎస్.లక్ష్మీకాంత్, సీనియర్ కోచ్ సోమనాథ్‌ఘోష్, మేయర్ పి.నీరజ హాజరవుతారని తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,400

ఊపిరి తీసుకోలేక..

ఇబ్బంది పడుతున్న చిన్నారులు

- శ్వాసకోశ రుగ్మతలతో పలువురి అస్వస్థత
- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు
- వాతావరణ మార్పులే కారణం!



భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

భద్రాచలంఅర్బన్: కొద్ది రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పులతో పసిపిల్లల్లో న్యుమోనియా లక్షణాలు అధికంగా కనిపిస్తున్నాయి. చలి పెరుగుతుండటంతో చాలామంది పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారు. దీంతో ప్రైవేట్.. ప్రభుత్వ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. భద్రాచలం పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి నిత్యం వచ్చేపిల్లల ఓపీ సంఖ్య ఇటీవల కాలంలో పెరిగింది. రెండు నెలలుగా కొద్ది రోజులు వర్షం పడటం ఆగిపోవడం, మళ్లీ వరుసగా రెండు రోజుల పాటు వర్షాలు పడటం ఆగిపోవటం, తరువాత మళ్లీ ఒక వారం రోజులు తీవ్రంగా ఎండ రావడం, ఆ తరువాత మళ్లీ వర్షాలు పడటంతో చలి వాతావరణంలో పిల్లలు అత్యధికంగా జ్వరం, దగ్గుతో పాటు ఆయాసానికి గురవుతున్నారు. నిపుణుల తెలిపిన వివరాల ప్రకారం.. న్యూమోనియా లక్షణాలున్న వారు శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుంటారు. శ్వాస తీసుకుంటున్నప్పుడు ఊపిరితిత్తుల ప్రాంతంలో సొట్టలు కనిపిస్తుంటాయి. పిల్లలు మరీ ఇబ్బందులకు గురవుతుంటారు. సాధారణంగా రెండు నెలలలోపు పిల్లలు నిమిషానికి 60 సార్లు, ఏడాదిలోపు పిల్లలు 50 సార్లు, ఐదేళ్ల లోపు పిల్లలు 40 సార్లు, ఐదేళ్లకు మించిన పిల్లలు 30 సార్లు శ్వాస పీల్చుకున్నారంటే వారిలో న్యుమోనియా లక్షణాలున్నట్లు భావించాలి.

జాగ్రత్తలే రక్ష..

న్యూమోనియా లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. దీని తీవ్రత పెరుగుతున్నా కొద్ది పిల్లలు తీవ్ర ఇబ్బంది పడుతుంటారు. తీవ్రతను బట్టి వైరల్ న్యుమోనియానా, బ్యాక్టీరియల్ న్యుమోనియానా అనే విషయాన్ని గుర్తించి వైద్యులు చికిత్స చేస్తారు. చలి కాలం మొదలయ్యే రోజులు వస్తుండటంతో ప్రస్తుతం ఈ రోగాలు చిన్నారుల దరిచేరకుండా రానున్న రోజుల్లో పిల్లలకు చల్లని గాలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వెచ్చగా ఉండే దుస్తులు వేయాలి. ద్విచక్ర వాహనంపై పిల్లలను తీసుకెళ్తుంటే చల్లటి గాలికి పిల్లల్లో జ్వరం, దగ్గు, ఆయాసం తదితర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముంది.

ఇతర సమస్యలు కూడా..

వైరల్ ఫీవర్ నుంచి క్రమంగా ఇతర వైరస్, బ్యాక్టీరియాలు కూడా సంక్రమించేందుకు అవకాశం ఉంది. ఇందుకు ఎక్కువ రోజులు పడుతుంది. గతంలో రెండు రోజులు చికిత్స తీసుకున్న సమస్యకు ఇప్పుడు ఎక్కువ రోజుల వరకు చికిత్స పొందాల్సి వస్తోంది. మొదటి దశలో అతి తక్కువ స్థాయిలో ఉంటుంది. క్రమక్రమంగా అది పెరిగి రెండో దశలో ఆస్తమా లక్షణాలు బయట పడుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. మూడు, నాలుగు దశల్లో రోజుకు రెండు, మూడు సార్లు రాత్రి పూట దగ్గు, ఆయాసంతో బాధపడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

వాతావరణ మార్పులతోనే..



వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పిల్లల ఆరోగ్య పరిరక్షణకు తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం పండుగ సెలవులు పూర్తయి పాఠశాలలు మొదలవడంతో హైజీన్ కారణంగా ఒకరి నుంచి మరొకరికి వ్యాధులు సోకడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నట్లుగా ఎక్కువ మంది చిన్నారుల్లో కనిపించింది. పిల్లల్లో ఏమాత్రం అనారోగ్య సమస్యలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన చికిత్స ఇప్పించాలి.

–డాక్టర్ క్రాపా విజయ్, పిల్లల వైద్య నిపుణుడు, భద్రాచలం

నిర్లక్ష్యం చేయకండి



పిల్లలకు వచ్చే దగ్గు, తుమ్ములు, జలుబు వంటి వాటికి తల్లిదండ్రులు తమకు తెలిసిన చిన్న చిన్న చిట్కాలను పిల్లల మీద ప్రయోగించే ప్రయత్నం చేస్తారు. వాటితో తగ్గిపోతుందనుకుంటారు. కానీ, కొన్ని సందర్భాల్లో వ్యాధుతు తీవ్రమవుతుంటాయి. ప్రత్యేకంగా వైద్యం చేయకపోతే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. తరచుగా పిల్లల వైద్యులను సంప్రదించి, వారి సలహాలను అనుసరించి మందులు తప్పనిసరిగా వాడాలి.

–డాక్టర్ రాజశేఖరరెడ్డి, ఆర్ఎంఓ, ఏరియా ఆస్పత్రి, భద్రాచలం

గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజురెడ్డి

అశ్వారావుపేట: అశ్వారావుపేట మీదుగా అక్రమంగా తరలిస్తున్న రూ.1.1 కోట్ల విలువైన 222 కిలోల (111 ప్యాకెట్లు) ఎండు గంజాయిని అశ్వారావుపేట పోలీసులు శనివారం పట్టుకున్నారు. సీఐ పింగళి నాగరాజురెడ్డి వివరాలు వెల్లడించారు. శనివారం ఉదయం ఎస్ఐ రామమూర్తి, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, జంగారెడ్డిగూడెం రోడ్‌లో పేపర్ మిల్లు సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. జంగారెడ్డిగూడెం వైపు నుంచి వస్తున్న పీ09బీవీ 5868 నంబరు గల కారును తనిఖీ చేయగా గంజాయి ఉన్నట్లు గుర్తించి విచారించారు. హైదరాబాద్‌కు చెందిన ఉంగరాల సరిన్‌కుమార్, బెల్లంపల్లికి చెందిన బాబర్‌ఖాన్ విశాఖపట్టణానికి చెందిన పంగి శ్రీను వద్ద రూ.4 లక్షలకు కొనుగోలు చేసిన 222 కిలోల ఎండు గంజాయిని మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన ఇంతియాజ్‌కు అధిక ధరకు అమ్మేందుకు అశ్వారావుపేట మీదుగా తరలిస్తున్నట్లు అంగీకరించారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీ ఎక్కువగా ఉందని భావించి సరిన్‌కుమార్ స్నేహితులైన హైదరాబాద్‌కు చెందిన ఎండీ ఫిరోజ్, సంతోష్ పైలట్‌గా ఓ ఇన్నోవా వాహనం వినియోగించారు. ప్రధాన నిందితుడు సరిన్‌పై గతంలో కూడా ఎన్‌డీపీఎస్ కేసులున్నట్లు సీఐ వెల్లడించారు. గంజాయి తరలించడానికి వినియోగించిన కారు, రెండు సెల్‌ఫోన్‌లు, జియో రూటర్, రూ.4 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ నాగరాజురెడ్డి వివరించారు. తనిఖీల్లో కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, కానిస్టేబుళ్లు సంతోష్, రమేశ్, హరిబాబు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



భూక్యా చంద్రు మృతదేహం

తిరుమలాయపాలెం: మిర్చి తోటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లి ఓ రైతు విద్యుదాఘాతానికి గురై బావిలో పడి మృతిచెందిన ఘటన మండలంలోని పడమటి తండాలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన భూక్యా చంద్రు (54) మిర్చి తోటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కి గురై పక్కనే ఉన్న వ్యవసాయబావిలో పడి మృతిచెందాడు. మృతుడికి భార్య అచ్చమ్మ కుమారుడు భూక్యా నరేశ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నకిలీ డీడీపై పోలీసుల ఆరా..!



ఇసుక క్వారీలో విచారిస్తున్న సీఐ అశోక్

మణుగూరుటౌన్: మండలంలోని రామానుజవరం ఇసుక క్వారీ నుంచి ఓ లారీ నకిలీ డీడీతో ఇసుక తీసుకెళ్తూ అశ్వాపురం మండలంలో పట్టుబడిన విషయం విదితమే. మరో మూడు లారీలు నకిలీ డీడీలతో వెళ్లి పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్నాయన్న ప్రచారం జోరుగా సాగింది. ఇసుక క్వారీ నిర్వాహకుల తీరుపై అక్కడ పనిచేస్తున్న టీజీఎండీసీ కాంట్రాక్ట్ సిబ్బందిపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో శనివారం రామానుజవరం ఇసుక క్వారీని అశ్వాపురం సీఐ అశోక్ క్షేత్రస్థాయిలో పరిశీలించి నకిలీ డీడీ వ్యవహారంపై టీజీఎండీసీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుని విచారించారు. ఈ విషయమై సీఐని వివరణ కోరేందుకు ప్రయత్నించగా, కేసు విచారణ దశలో ఉందన్నారు.

19న రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ

ఖమ్మంఅర్బన్: తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 19న ఖమ్మంలో రాష్ట్రస్థాయి అండర్- 14 చెస్ టోర్నీ నిర్వహించనున్నారు. ఖమ్మం పాత బస్టాండ్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగే టోర్నీ పోస్టర్లను శనివారం నగర ఏసీపీ రమణమూర్తి ఆవిష్కరించారు. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు టి.వీరన్న తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పోలీసులు పట్టుకున్న పశువులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం మీదుగా ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి భద్రాచలం మీదుగా బూర్గంపాడు మండలంలోని ముసలమడుగుకు అక్రమంగా ఓట్రాలీలో ఐదు దూడలను తరలిస్తుండగా బ్రిడ్జి సెంటర్‌లోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఇదిలాఉండగా.. ఒడిశా నుంచి భద్రాచలం మీదుగా గుంటూరుకు టమాటా ట్రేలతో వెళ్తున్న డీసీఎంను ఆపి తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న 30 పశువులును పట్టుకున్నారు. లారీలో తరలిస్తున్న వాటిలో ఒకటి భద్రాచలంలో మృతి చెందగా మరొకటి పాల్వంచ గోశాలకు తరలించిన తరువాత మృతి చెందిందని, మరో 7 పశువుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు. ట్రాలీలో తరలిస్తున్న దూడల్లో ఒకటి గోశాల వద్ద మృతి చెందింది. మొత్తం ముగ్గురిపై కేసు నమోదు చేసి, పట్టుబడిన పశువులను పాల్వంచలోని అన్నపూర్ణ గోశాలకు తరలించారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్..

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని అనంతారం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను శనివారం తహసీల్దార్ నరేశ్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంతారం నుంచి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను పక్కా సమాచారంతో పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించామని చెప్పారు. దాడుల్లో డీటీ, ఆర్ఐ గోపి ఉన్నారు.

కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభం

మధిర: పట్టణంలోని శివాలయం రోడ్డులో పోతులూరి వీరబ్రహ్మం గుడి వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌తో పాటు స్తంభం శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి కూలిపోయాయి. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవటంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు విద్యుత్ శాఖాధికారులకు సమాచారం ఇవ్వటంతో ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

వివాహిత అదృశ్యం



కాంచన (ఫైల్)

ములకలపల్లి: వివాహిత కనిపించకుండా పోయిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది.ఎస్ఐ మధుప్రసాద్ కథనం మేరకు.. మండలంలోని ముత్యాలంపాడు గ్రామానికి చెందిన పొడియం కాంచన గత నెల 16న వైద్యశాలకు వెళ్లి వస్తానని చెప్పి, ఇంటి నుంచి వెళ్లింది. కానీ, తిరిగి రాకపోవడంతో భర్త పొడియం ప్రసాద్ శనివారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచరూరల్: క్యాన్సర్ సోకిన వ్యక్తి మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన ఇస్త్రీ షాపు యజమాని కుమ్మరికుంట్ల రాము (55) శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లోని మామిడి చెట్టుకు చీరతో ఉరి వేసుకుని మృతి చెందాడు. తెల్లవారుజామున ఆవరణలో శుభ్రం చేస్తున్న భార్య సుజాత.. చెట్టుకు వేలాడుతున్న భర్త మృతదేహాన్ని చూసి కేకలు వేసింది. సమాచారం అందుకున్న ఎస్ఐ సురేశ్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ప్రశాంత్, మౌనిక ఉన్నారు.

చట్టాలను అధ్యయనం చేయాలి

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి శివశంకర్‌రావు



మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి శివశంకర్‌రావు

ఖమ్మం లీగల్: న్యాయవాదులు చట్టపరమైన సూత్రాలను లోతుగా అధ్యయనం చేసి, ఆస్తుల బదిలీల్లో జరిగే పొరపాట్లను నివారించేలా కక్షిదారులకు సరైన సలహాలు ఇవ్వాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.శివశంకర్‌రావు అన్నారు. ఐలు జిల్లా, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 'ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్ –మార్కింగ్ ఆఫ్ డాక్యుమెంట్స్' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శివశంకర్‌రావు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్ నిబంధనలను న్యాయవాదులంతా తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు కోర్టుల గౌరవాన్ని కాపాడాలని, న్యాయంపై ప్రజలకు నమ్మకం పెంచాలని సూచించారు. రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి వెంపటి అపర్ణ మాట్లాడుతూ డాక్యుమెంట్ల మార్కింగ్‌లో ప్రతీ న్యాయవాది జాగ్రత్తగా ఉండాలని అన్నారు. బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొండపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు యువ న్యాయవాదులకు చట్ట పరిజ్ఞానాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షుడు నవీన్ చైతన్య, సత్తుపల్లి, మధిర బార్ అసోసియేషన్ల అధ్యక్షులు మల్లెపూల వెంకటేశ్వరరావు, బోడెడ్ల పుల్లరావు, ఐలు బాధ్యులు మందడపు శ్రీనివాసరావు, ఏడునూతల శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకట్, గద్దల దిలీప్, మీసాల వెంకటేశ్వర్లు, పాగోలు కిషోర్ పాల్గొన్నారు.

అండర్–19 వాలీబాల్, హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక



వాలీబాల్ ఉమ్మడి జిల్లా బాలుర జట్టు

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్ కళాశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన వాలీబాల్, హ్యాండ్‌బాల్ బాలబాలికల జట్లను ఎంపికచేశారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం నిర్వహించిన ఎంపిక పోటీలకు 170 మంది వాలీబాల్‌క్రీడాకారులు, వంద మంది హ్యాండ్‌బాల్ క్రీడా కారులు హాజరయ్యారు. ఇక్కడ ఎంపిక చేసిన జట్లు హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని జిల్లాక్రీడల సంఘం కార్యదర్శి ఎండీ మూసాకలీం తెలిపారు. వాలీబాల్ జిల్లా బాలుర జట్టుకు జి.అక్షయ్‌కుమార్, ఎ.గోపినాథ్, వి.నాయుడు, ఈ.అనిల్‌కుమార్, ఎస్.శివకోటి, పి.విష్ణువర్ధన్, బి.కల్యాణ్‌ప్రసాద్, ఎన్.శ్రీహాస్, టి.వినయ్, ఎం.శ్యామ్, ఎండీ అస్లాం, పి. వంశీ, టి.శ్రీరాం, రవికుమార్, జోషినాథ్, రోహిత్, బాలికల జట్టుకు బి.అంబిక, ఎం.నక్షత్ర, కె.ప్రసన్నకుమారి, జి.నవ్యశ్రీ, ఎ.కీర్తన, విద్యశ్రీ, బి.తనూజ, ఆర్.శ్రావణి, డి.పుష్పలత, అతియా ఫాతిమా, ఎస్.ఉమాలత, వి.బేబికల్యాణి, అస్మిత ఎంపికయ్యారని పేర్కొన్నారు. హ్యాండ్‌బాల్ బాలుర జట్టులో విగ్‌నాగ్‌పక్, తియామాత్, కె.వేణు, ఎస్‌కే ఇమ్రాన్, ఎం. యశ్వంత్, ఎస్‌కే జకీరుల్లా, జె.గౌతమ్, ఎం.హర్షిత్, జె.రాంచరణ్, వి.పవన్, జి.లాల్‌కృష్ణ, ఐ.కార్తీక్, ఎండీ అబ్దుల్లా, సీహెచ్ కార్తీక్‌రెడ్డి, ఎం.జనార్దన్, సంతోష్ కుమార్, కె.వంశీ, ఎస్.కార్తీక్ ఎంపికయ్యారని తెలిపారు. అలాగే, బాలికల జట్టులో ఉషాశ్రీనేహ, టి. భవాని, పి.సింధు, వి.సంధ్య, జె.సౌమ్య, సాబా తబస్సుమ్,డి.భారతి, కె.సాత్విక, కె.హర్షిణి, సీహెచ్. మాధురి, జె.జ్యోత్స్న, అక్షర, బి. రిషిత, ఎస్.అక్షర, బి.కార్తీకరెడ్డికి స్థానం దక్కిందని వెల్లడించారు.

- జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన జిల్లా అండర్–14 బాలబాలికల కబడ్డీ జట్లను శనివారం ఖమ్మంలో ఎంపిక చేశారు. ఈ పోటీలకు 107 మంది బాలురు, 70 మంది బాలికలు హాజరు కాగా జిల్లా జట్లను సంఘం కార్యదర్శి వై.రామారావు ప్రకటించారు. బాలుర జట్టుకు బి.హర్ష, పి.సంతోష్, ఎ.మనోజ్, కె.యశ్వంత్, ఎ.యశ్వంత్, ఆర్.జేమ్స్, బి.అరుణ్, బి.వెంకటేశ్, ఎల్.కౌశిక్, బి.సరిరాం, కె.నాగర్జున, బి.అంజిబాబు, ఎస్.గోపి, కె.అక్షయ్‌కృష్ణ, పి.బాబు, బాలికల జట్టుకు నాగస్వర్చిత, ఎం.శ్రీజ, కెభవ్యశ్రీ,, కె.ఫరిదా, బి.అనూ, కె.భవాని, జి.సృజన, ఎస్‌కే సమీనా, డి.దేవిశ్రీ, వి.మోక్షితకృష్ణ, ఎల్.స్పందన, జి.అంకిత ఎంపికయ్యారని తెలిపారు.



ఉమ్మడి జిల్లా ఖో-ఖో బాలికల జట్టు

- కల్లూరు: ఉమ్మడి జిల్లా ఖో–ఖో బాలబాలికల జట్లను కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఎంపిక చేశారు. అండర్–19 విభాగంలో జట్ల ఎంపికకు నిర్వహించిన పోటీలకు బాలురు 130 మంది, బాలికలు 90 హాజరయ్యారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేశామని నిర్వహణ కార్యదర్శి బోడా బీమా, పసుపులేటి వీరరాఘవయ్య, మూసా ఖలీమ్ తెలిపారు. పోటీలను పీఈటీలు, కోచ్‌లు ఎస్.రామారావు, పి.పవన్‌కుమార్, ఎ.కృష్ణ, ప్రసాద్, సైదులు, సమ్మయ్య, కై సర్ పద్మావతి, స్టేడియం ఇన్‌చార్జ్ గౌతమ్‌రెడ్డి, నాగబాబు, మామిడాల వెంకటేశ్వరరావు, గోపాల్‌రావు పర్యవేక్షించారు.